సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 3 । మే । 2024



ఆగని వలసలు

పలాస టీడీపీలో వలసలు ఆగడం లేదు. వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారు.

- 8లో



దోశ తినిపించి..

అమలపాడులో వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. బంగారం కోసం హత్య చేసినట్లు నిర్ధారించారు.

- 8లో

ఖైదీలతో మాట్లాడే సమయాల్లో మార్పు

గార: అంపోలు జిల్లా జైలులో ఉన్న ఖైదీలతో వారి బంధువులు మాట్లాడే సమయాల్లో మార్పులు జరిగాయని, రాష్ట్ర జైళ్ల డీజీ ఆదేశాల మేరకు సవరణలు గమనించాలని జిల్లాజైలు సూపరిడెంటెంట్ ఎస్‌కే నభీఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ములాఖత్ ఉంటుందన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా మే 2వ తేదీ నుంచి జూన్ 15 వరకు ఈ సమయాలు ఉంటాయని తెలిపారు.

న్యూస్‌రీల్

కిడ్నీ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్



పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసుకున్న లక్ష్మణరావు

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఓ వ్యక్తికి ఉచితంగా అపెండిక్స్ ఆపరేషన్ చేశారు. నందిగాం మండలం కణితి ఊరు గ్రామానికి చెందిన పాలవలస లక్ష్మణరావు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా అపెండిక్స్‌గా గుర్తించి సకల సౌకర్యాల నడుమ ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ తర్వాత చక్కగా చూసుకుంటున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆస్పత్రిలో రూ.20వేలు ఖర్చవుతుందని, ఇక్కడ ఉచితంగా చేస్తున్నారని, పేదలు వినియోగించుకోవాలని కోరారు.

తాను మరణించి.. మరో ఐదుగురికి బతుకునిచ్చి



వెంకుమహంతి శ్రీనివాసరావు(ఫైల్)

పొందూరు: మరణించినా సంపూర్ణ అవయవదానంతో చిరంజీవిగా నిలిచారు పొందూరుకు చెందిన వెంకుమహంతి శ్రీనివాసరావు(54). ఆయన విజయనగరం జిల్లాలో ఆరోగ్యశాఖలో ఉద్యోగం చేస్తున్నారు. గత నెల అధిక రక్తపోటు కారణంగా కోమాలోకి వెళ్లారు. మెదడులో రక్తం గడ్డకట్టింది. దీంతో విశాఖపట్నంలోకి విమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గురువారం మరణించారు. ఇంతటి బాధను దిగమింగుకుని తన భార్య సునీత, కుమారుడు సంపూర్ణ అవయవదానానికి అంగీకరించారు. కళ్లు, కిడ్నీలు, కాలేయం, గుండె తదితర అవయవాలను ఐదుగురు వ్యక్తుల కోసం ఆస్పత్రులకు తరలించారు. దీనికి అధికారులు గ్రీన్ చానెల్ ఏర్పాటు చేశారు. శ్రీనివాసరావు మృతిపై పొందూరు శిష్టకరణ సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

36 రోజులకు రూ.31.85 లక్షలు



నగదును లెక్కిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి హుండీల కానుకల ద్వారా రూ.31,85,917 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ/డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈమేరకు గురువారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం అనివెట్టి మండపంలో నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 28 నుంచి గురువారం వరకు మొత్తం 36 రోజులకు హుండీల్లో లభించిన ఆదాయాన్ని లెక్కించగా.. నగదు రూపంలో రూ.30,74,034, చిల్లర రూపంలో రూ.1,11,883 వరకు లభించింది. అలాగే 24 గ్రాముల బంగారం, వెండి 1 కేజీ 470 గ్రాముల వస్తువులతో పాటు పలు దేశాల కరెన్సీ కూడా కానుకల రూపంలో లభించాయి. జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు ప్రక్రియలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు ద్వారపు అనూరాధ, ఎన్.కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావు, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, జిల్లా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలింగ్ రోజున దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన వీల్‌చైర్లను నియోజకవర్గాల వారీగా పంపిణీ చేశారు. 1700 వీల్ చైర్లు, కంటి చూపు తక్కువ ఉన్నవారికి మాగ్నిఫయింగ్ అద్దాలు (భూతద్దాలు) 1700 వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ, సహాయ సంచాలకులు కవిత తదితరులు పాల్గొన్నారు.



వీల్ చైర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జేసీ నవీన్ తదితరులు

అధికారులంటే అంత అలుసా..

ఉద్యోగులపై కూన రవి ప్రతాపం

'వాహనాలు విడిచిపెట్టు. లేకపోతే లంచం డిమాండ్ చేశావని నీ మీద కంప్లైంట్ చేస్తాను. వెధవా...నువ్వు సీజ్ చేశావ్ ..చెప్పు ఎంత కావాలి... పది వేలు కావాలా, లక్ష కావాలా ఎంత కావాలి... ప్రాసెస్ గురించి నాకు చెబుతున్నావా?' అంటూ రాయలేని భాషలో ఒక మండల మెజిస్ట్రేట్‌గా ఉన్న పొందూరులో పనిచేసిన తహసీల్దార్‌ను కూన రవికుమార్ బెదిరించారు.

'నీకెంత ఒల్లు బలిసిందిరా నా.. 'దకా'...నిన్ను గొయ్యి తీసి పాతకపోతే నా పేరు కూన రవి కుమారే కాదు. నీ బతుకెంతరా నా.. డకా...' సరుబుజ్జిలి ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న వ్యక్తిని ఫోన్‌లో కూన రవికుమార్ బెదిరింపు ఇది.

'ఆఫీసులోనే తలుపులు వేసి మరీ బాదేస్తాను. నన్ను ఎవరూ ఆపలేరు. చెట్టుకు కట్టి కాల్చేస్తాను. చెప్పింది చేయకపోతే నేనేంటో చూపిస్తా...' ఆ మధ్య సరుబుజ్జిలి ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలకు కూన రవికుమార్ ఇచ్చిన వార్నింగ్ ఇది.



'చెప్పినట్టు వినకపోతే కుర్చీలో కూర్చున్నా లాక్కుని వచ్చి తంతాను నా.. దకల్లారా..' అంటూ పంచాయతీ కార్యదర్శులను కూన రవికుమార్ భయపెట్టారు.

'శంకరిగిరి మాన్యాల్లో ఉంటారు జాగ్రత్త.. ఎవడక్కడ.. మీ స్థాయి ఎంత.. మీరు ఎంత..' అని నరసన్నపేట సీఐ, ఎస్‌లను ఉద్దేశించి కూన నోరు పారేసుకున్నారు. కోవిడ్ నిబంధనల మేరకు ముగ్గురే లోపలికి రావాలి అన్నందుకు పోలీసు అధికారులపై పై విధంగా విరుచుకుపడ్డారు.

టీడీపీ ఆందోళనలకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యను దృష్టిలో ఉంచుకుని కూన రవికుమార్‌ను నిలువరించేందుకు ఇంటికెళ్లిన పోలీసు అధికారులను నెట్టేసి నోటికొచ్చినట్టు దూషించారు. 'నా ఇంటికి పోలీసులను పంపిస్తే నీ కాళ్లు ఇరగకొట్టక(బూతు) పోతే చూద్దువుగాని.. నిన్ను ఉద్యోగం, యూనిఫాం లేకుండా చేస్తా...నీ అంతు చూస్తాను ఏమనుకుంటున్నావో..' అంటూ భౌతికంగా శ్రీకాకుళం టూటౌన్ సీఐ ఆర్‌ఈ సీహెచ్ ప్రసాద్‌ను కూన నెట్టేశారు.

- ప్రతిపక్ష నాయకుడిగా పలుమార్లు దౌర్జన్యం
- కొడతాను..తంతాను...చెట్టుకు కట్టి చంపుతాను..బట్ట లూడదీస్తా అంటూ వీరంగం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఇదీ టీడీపీ నాయకుడు కూన రవికుమార్ ట్రాక్ రికార్డు. అధికారులంటే తన ఇంటిలో పని మనుషులే అన్నంత అలుసు ఆయనకు. అధికారంలో ఉన్నంతసేపూ ఆయన దౌర్జన్యాలకు అడ్డు అదుపూ లేకుండా పోయింది. ఆయన్ని చూస్తేనే ఉద్యోగులు, అధికారులు హడలెత్తిపోయిన పరిస్థితి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయాక కూడా ఆయన నోటి దురుసు, దౌర్జన్యం తగ్గలేదు. ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ ఈ ఐదేళ్లలో ఎంతో మంది ఉద్యోగులను, అధికారులను దూషించారు. నోటికొచ్చినట్టు తిడుతూ బెదిరించారు. ఈయన నిర్వాకంపై పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై విడుదలైన పరిస్థితులు ఉన్నాయి. చివరికి రవికుమార్‌తో ప్రాణహాని ఉందని ఉద్యోగులు ఆందోళనకు దిగేంత వరకు వెళ్లారు. రౌడీషీట్ ఓపెన్ చేయాలని కూడా డిమాండ్ చేశారు. గోరింట గ్రామంలోని రామసాగరం చెరువులో రవికుమార్ సోదరుడికి చెందిన రెండు జేసీబీలు, నాలుగు టిప్పర్లతో మట్టిని అక్రమంగా తవ్వుతుండగా వీఆర్‌ఓ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ అక్కడకు చేరుకుని వాహనాలను సీజ్ చేశారు. దీన్ని జీర్ణించుకోలేని కూన రవికుమార్ ఏకంగా పొందూరు తహసీల్దార్ రామకృష్ణను బెదిరించారు. పింఛన్ల విషయంలో తన మాట విన లేదని మండల కార్యాలయంలోనే సరుబుజ్జిలి ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీకి వార్నింగ్ ఇచ్చారు. పనుల విషయంలో తాను చెప్పినట్టు వినకపోతే కుర్చీలో కూర్చున్నా లాక్కుని వచ్చి తంతాను నా కొడకల్లారా అని.. పంచాయతీ కార్యదర్శులను కూన రవికుమార్ భయపెట్టారు. ఒక బిల్లు విషయంలో సరుబుజ్జిలి ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. కరోనా నిబంధనల దృష్ట్యా గేటు వేస్తే వీరంగం సృష్టించారు.

ఆగ్రహంతో ఉద్యోగులు

కూన రవికుమార్‌తో పాటు ఆయన సోదరుడు అనుసరించిన తీరుపై ప్రభుత్వ ఉద్యోగులంతా గుర్రుగానే ఉన్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నామని చాలా సందర్భాల్లో ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేశారు. అధికారంలో లేనప్పుడే ఇలా ఉంటే పొరపాటున అధికారమిస్తే బతకనిస్తారా? అని ఆవేదనతో ఉన్నారు. ఏ పదవీ లేకుండానే అధికారులను బెదిరించడం, తంతాను అనడం.. బట్ట లూడదీసి కొడతానని బెదిరించడం వంటివి పరిణామాలను అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారులే ఇబ్బంది పడుతుంటే.. చిన్నపాటి ఉద్యోగుల పరిస్థితి మరింత భయంకరమని ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పలు సందర్భాల్లో ఆందోళనకు దిగడమే కాకుండా రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేసే వరకు వెళ్లారు. తమపై దౌర్జన్యం చేస్తున్న కూన రవి అండ్‌కోకు తగిన సమయంలో బుద్ధి చెబుతామని ఉద్యోగులంతా ఒక నిర్ణయానికి వచ్చిన సందర్భాలు ఉన్నాయి.

పచ్చ పాపాలు-6

కూన రవి సోదరుడిదీ అదే దౌర్జన్యం

శ్రీకాకుళంలోని పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ కార్యాలయంలో కూన రవికుమార్ సోదరుడు, కాంట్రాక్టర్ వెంకట సత్యనారాయణ బరితెగించి వ్యవహరించాడు. తాను వేస్తున్న రోడ్డు పనుల విషయంలో నిబంధనలు పాటించడం లేదని, నాణ్యతా లోపాలున్నాయని, వాటిని సరి చేసుకోవాలని చెప్పినందుకు అసిస్టెంట్ ఇంజనీర్ మహంతిని కొట్టేంత పనిచేశారు. కార్యాలయంలో అందరు ఉద్యోగుల ముందే అసిస్టెంట్ ఇంజనీర్ మీదకొచ్చి దౌర్జన్యం చేయడమే కాకుండ చెయ్యి ఎత్తి తన రౌడీయిజాన్ని చూపించారు. 'ఎంత ధైర్యం రా... నాకే నోటీసు ఇస్తావా...నువ్వు ఏమనుకుంటున్నావ్...నేను కూన రవికుమార్ బ్రదర్‌ని.. జాగ్రత్త...ఇక్కడే పాతేస్తా...' అంటూ ఇంజనీర్ మహంతిపై కూన వెంకట సత్యనారాయణ రెచ్చిపోయాడు. అంతటితో ఆగలేదు.. ఏకంగా కొట్టేసేంతలా చెయ్యి చాచి బెదిరించాడు. నోటికొచ్చినట్టు బూతులు తిట్టారు. రాయలేని భాషలో పరుష పదజాలంతో వీరంగం సృష్టించారు.

'హోమ్ ఓటింగ్‌పై దృష్టి సారించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలింగ్‌లో ఎక్కడా పొరపాట్లు జరగకూడదని, హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఆయన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావుతో కలసి రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ ఏర్పాట్లపై ఆర్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఈవీఎం బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబంధించిన సమాచారం, ఈవీఎం కమిషన్ కేంద్రాలు, ఈవీఎం జాబితాల 2వ ర్యాండమైజేషన్ అభ్యర్థి ఏజెంట్ నియామకం, పోలింగ్ ఏజెంట్ నియామకం తదితర అంశాలను వివరించారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎం, వీవీప్యాట్‌ను భద్ర పరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం మ్యాప్‌లను గురువారం జిల్లా అధికారులు పరిశీలించారు. ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్ల, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్పీ జీఆర్ రాధిక, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తదితరులు మ్యాప్‌లను పరిశీలించారు.

చంద్రబాబుకు ఓటు అడిగే హక్కు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

- జిల్లా బార్ అసోసియేషన్ సమావేశంలో రెవెన్యూ మంత్రి ధర్మాన, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పద్నాలుగేళ్లు సీఎంగా ఉండి ఏనాడూ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని చంద్రబాబుకు జనాలను ఓటు అడిగే హక్కు లేదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజమెత్తారు. ఆయన గురువారం శ్రీకాకుళంలోని జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని తెలిపారు. నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడితో విద్యా రంగంలో వినూత్న సంస్కరణలు అమలు చేశామని గుర్తు చేశారు. అభివృద్ధిలో భాగంగా నాలుగు సీ పోర్టులు నిర్మిస్తున్నామని, టెక్కలి దగ్గర రూ.4 వేల కోట్లతో మూలపేట పోర్టు వేగంగా జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయితే మరో రెండు, మూడు నెలల్లో ప్రపంచంతో కనెక్టివిటీ ఏర్పడుతుందన్నారు. అలానే ఉద్దానం ప్రాంతంలో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం రూ.800 కోట్లతో వాటర్ స్కీమ్, కిడ్నీ ఆస్పత్రి నిర్మించామని చెప్పారు. శ్రీకాకుళంలోని రిమ్స్‌లో ఎప్పుడూ సిబ్బంది కొరత ఉండేదని, కానీ ఈ ఐదేళ్లలో వైద్య వ్యవస్థలో సమూల మార్పులు చేసి ఖాళీలను భర్తీ చేశామన్నారు. సమగ్ర భూ సర్వే ద్వారా రాష్ట్రంలో ఉన్న 17 వేల రెవెన్యూ గ్రామాలకు సంబంధించి ఇప్పటికే నాలుగు వేల గ్రామాల్లో పనులు పూర్తి చేశామన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమల్లోకి రాదు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌కు రాష్ట్రంలో అమలులోకి రాదని ధర్మాన స్పష్టం చేశారు. అనేక అధ్యయనాల తర్వాత కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్‌తో ఓ మోడల్ యాక్ట్‌ను తీసుకుని వచ్చిందన్నారు. కానీ అమలు చేయలేదని, దీని అమలుకి ముందు న్యాయవాదుల, మేధావుల సూచనలు పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. చంద్రబాబు హయాంలో శ్రీకాకుళానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఒక్క కేంద్ర సంస్థనైనా ఇక్కడ నెలకొల్పలేదని గుర్తు చేశారు. అమరావతి అంటూ వ్యాపారం చేశారన్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో ఆచరణ సాధ్యమేనా అన్నది గమనించాలన్నారు. చంద్రబాబు మళ్లీ జనాలను మోసగించేందుకు చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని జగన్ చెబుతుంటే ఎందుకు అడ్డు పడుతున్నారని ప్రశ్నించారు. మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే ఉత్తరాంధ్ర స్థితిగతులు మారుతాయన్నారు. జనాలకు మేలు జరగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి ధర్మాన ప్రసాదరావుని, పేరాడ తిలక్‌ను సత్కరించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి పిట్లా దామోదరరావు, రాష్ట్ర కార్యదర్శి పొన్నాడ వెంకటరమణారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిలారి ఈశ్వరరావు, కార్యదర్శి ప్రసన్న, మాజీ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, ఆగూరి ఉమామహేశ్వరరావు, తంగి చంద్రశేఖరరావు, బైరి దామోదరరావు, ఎన్ విజయ్‌కుమార్, మామిడి క్రాంతి, చిన్నాల జయకుమార్, గేదెల ఇందిరాప్రసాద్, జి.వాసుదేవరావు, పీస చంద్రశేఖర్ ఉన్నారు.

కోటబొమ్మాళి: స్టేట్‌బ్యాంకు బీసీ పాయింట్ వద్ద పింఛన్ డబ్బుల కోసం వృద్ధుల పడిగాపులు



చంద్రబాబు చెలగాటం

పింఛన్‌దారులకు ప్రాణసంకటం

ఒకటో తేదీకి ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందిస్తుంటే టీడీపీ నేతలు చూడలేకపోయారు. దివ్యాంగులు, వృద్ధులు, నిస్సహాయులకు ఏ కష్టం లేకుండా పెన్షన్లు ఇస్తుంటే వారు తట్టుకోలేకపోయారు. వలంటీర్ల సేవలు వద్దంటే వద్దంటూ ఫిర్యాదులు చేయించి మరీ అడ్డుకున్నారు. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ మోసం చేస్తున్నారు. చంద్రబాబు కుట్రల ఫలితంగా పింఛన్‌దారులు నానా అవస్థలు పడుతున్నారు. నలభై డిగ్రీల ఎండలో కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించి బ్యాంకు క్యూలలో నిలుచుంటున్నారు. ఇబ్బందిపడిన ప్రతి పింఛన్‌దారుడు బాబును అక్కడే తిట్టి పోస్తున్నారు.



ఆమదాలవలసలో స్టేట్ బ్యాంకు దగ్గరకు ఎండల్లో ఇక్కట్లు పడుతూ చేరుకుంటున్న వృద్ధురాలు

చంద్రబాబూ నీకిది న్యాయమా..



చంద్రబాబూ నీకిది న్యాయమా. ఇది నీ పుణ్యమేనని అందరూ చెప్పుకుంటున్నారు. కడుపులో చల్ల కదలకుండా ఏ ఇబ్బందీ లేకుండా ఒకటో తేదీకి పింఛను డబ్బులు ఇచ్చేవారు. ఈ నెల కుర్రాళ్లు నన్ను మోసుకుంటూ రిక్షాలోకి ఎక్కించారు. పాక్కుంటూ బ్యాంకులోకి వెళ్లి డబ్బు తీసుకున్నాను. మళ్లీ పాత రోజులు గుర్తు చేశావు. నరక యాతన పెట్టావు బాబూ.

– హిమండి వెంకటరావు, వెంగళరావు కాలనీ, ఆమదాలవలస మున్సిపాలిటీ

15 కిలోమీటర్లు వెళ్లాలి..



వేకువ జామునే ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చిన వలంటీర్లను కాదని, ఇప్పుడు ఇచ్ఛాపురం బ్యాంకుకు వెళ్లి పింఛన్లు తెచ్చుకోమంటున్నారు. మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. మేము ఆటోలు బుక్ చేసుకొని వెళ్లాల్సిందే. బ్యాంకుల్లో వందల మంది ఉన్నారు. చంద్రబాబు వల్లే మాకు ఈ తిప్పలు.

– మంగి కుభేరు, చాకల సుందరమ్మ, పింఛన్‌దారులు, అరకబద్ర, ఇచ్ఛాపురం



ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం బ్యాంకులో కిక్కిరిసి ఉన్న పింఛన్‌దారులు



పలాస స్టేట్ బ్యాంకు వద్దకు నడవలేని స్థితిలో పింఛన్‌దారుడి కష్టాలు

బ్యాంకుకు వెళ్లాలంటే కష్టం..



మేము మారుమూల గ్రామంలో ఉంటాం. మేం ఆటో కట్టుకుని బ్యాంకుకు వెళ్లాలంటే రూ.500 అవుతాయి. ఎండలో పడిగాపులు కాయాలి. వలంటీర్ ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకు ఇంటికి వచ్చి డబ్బులు ఇచ్చేవాడు. చంద్రబాబు నిర్వాకం వల్ల మాకు ఈ అవస్థలు వచ్చాయి. మళ్లీ జగనన్నే అధికారంలోకి రావాలి.

– పిట్ట పున్నయ్య, పింఛనుదారుడు, మామిడిపల్లి, పలాస మండలం

బాబు పాలన గుర్తొచ్చింది..



నా పేరు కొర్లాపు కన్నయ్య. నాకు 76 ఏళ్లు. ప్రభుత్వం నుంచి కళాకారుల పింఛన్ వస్తోంది. ప్రతి నెలా వలంటీర్ ఇంటికి వచ్చి చేతిలో డబ్బులు పెట్టేవాడు. ఈ నెల బ్యాంకులో వేశారు. మా ఊరు కొర్లాం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గార వెళ్లాను. ఉదయం 10 గంటలకు వెళ్తే మధ్యాహ్నం 2 గంటలకు డబ్బులు ఇచ్చారు. ఇంటికి వచ్చే సరికి మూడు గంటలైంది. మధ్యాహ్నం భోజనం కూడా చేయలేదు. చంద్రబాబు పాలన గుర్తుకువచ్చింది.



గార: శ్రీకూర్మంలో ఏపీజీవీ బ్యాంకు లోపల నిండిపోవడంతో బయట నిరీక్షిస్తున్న వృద్ధులు



కొత్తూరు యూనియన్ బ్యాంకు వద్ద

జిల్లా దాటి వచ్చాను..



పింఛన్ కోసం పార్వతీపురం మన్యం జిల్లా మర్రిపాడు నుంచి కొత్తూరులోని యూనియన్ బ్యాంకుకు వచ్చాను. ఎండలతో చాలా ఇబ్బంది పడ్డాను. వలంటీర్లు లేకపోవడం వల్ల ఇలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– గొర్లె దుర్జన మర్రిపాడు, సీతంపేట మండలం



కోటబొమ్మాళి: స్టేట్‌బ్యాంకు ఆవరణలో వృద్ధులు



జలుమూరు: చల్లవానిపేట బ్యాంక్ ముందు నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్



శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం దర్శించుకున్నారు. ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈయన వెంట జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ రోణంకి జయప్రకాష్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



అడ్డ పాపారావు

సంతబొమ్మాళి: మండలంలోని ఉమిలాడ పంచాయతీ పెద్దకొరవిపేటకు చెందిన అడ్డ పాపారావు (57) అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. కోల్‌ఇండియా కంపెనీలో పనిచేస్తున్న పాపారావు గత నెల 7న తీన్సుక (అస్సాం) నుంచి శ్రీకాకుళం జంక్షన్‌కు వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. 8వ తేదీ రాత్రి ఖర్గపూర్ రైల్వే స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఆచూకీ లేకుండాపోయింది. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిసిన వారు 9701215034 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

అధిక మోతాదులో మందులు తీసుకొని వ్యక్తి మృతి

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన తమరాల రమేష్(46) కడుపు నొప్పి నివారణకు అధిక మోతాదులో మందులు తీసుకోవడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రమేష్ కొన్నాళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి ఎక్కువ మోతాదులో మందులు వేసుకొని నిద్రపోయాడు. గురువారం వేకువజామున అపస్మారక స్థితికి చేరడాన్ని తల్లి సరోజిని గమనించింది. గ్రామస్తుల సహకారంతో సోంపేట సీహెచ్‌సీలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రమేష్ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

టెక్కలి రూరల్: వలేసాగరం గ్రామ సమీప జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఉదయం 5 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడి వయసు 70 ఏళ్లు ఉండవచ్చని, ఒక్క తువ్వాలు మాత్రమే ధరించి ఉన్నాడని, యాచకుడై ఉండవచ్చునని భావిస్తున్నారు. టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన వివాహిత వరకట్నం వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పెద్దకొజ్జిరియాకు చెందిన మార్పు సింధు(20)కు అదే గ్రామానికి చెందిన జగదీష్‌తో వివాహమైంది. వీరికి 14 నెలలు బాబు ఉన్నారు. కొన్నాళ్లుగా సింధును భర్త జగదీష్, మామయ్య రాఘవులు, అత్త చిరంజీవులు వరకట్నం కోసం వేధిస్తుండటంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో గొడవ జరగడంతో అందరూ చూస్తుండగానే సింధు గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు చీరకట్టి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సింధును రక్షించి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతోంది. సింధు తండ్రి జయరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ వి.రాజేష్ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని కోటబొమ్మాళి కి చెందిన రొక్కం సాయి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలిలో వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాలువలోకి తుళ్లిపడిన యువకుడిని గుర్తించిన స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు వినోద్ క్షతగాత్రుడిని పరీక్షించి తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. టెక్కలి ఎస్.లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలాస దేశంలో.. ఆగని వలసలు



కాశీబుగ్గ: రాజాంకాలనీలో పార్టీలో చేరిన బీజేపీ, టీడీపీ కార్యకర్తలతో మంత్రి సీదిరి అప్పలరాజు

- తెలుగుదేశాన్ని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న క్యాడర్
- శిరీషా, శివాజీ, వెంకన్నల నిరంకుశ వైఖరే కారణం
- సీదిరి నేతృత్వంలో జరిగిన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రశంసలు



వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, టీడీపీ నాయకులు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సిర్ల రవిచంద్ర

కాశీబుగ్గ: పలాసలో వలసల పర్వం కొనసాగుతోంది. తెలుగుదేశం పార్టీ రోజురోజుకూ ఖాళీ అవుతోంది. సామాన్యులతో పాటు విద్యావంతులు, మేధావులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా చూసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. సుమారు 65 ఏళ్ల పాటు ఈ ప్రాంతాన్ని పాలించిన గౌతు కుటుంబాన్ని నమ్మే పరిస్థితి లేక గత ఎన్నికల్లో టీడీపీని ఓడించారు. ఈసారి మళ్లీ మాయామాటలు చెప్పేందుకు వస్తున్నా ఎవరూ నమ్మడం లేదు. దీంతో సీదిరి అప్పలరాజు నేతృత్వంలో వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

చేరికలతో పెరిగిన వైఎస్సార్ సీపీ బలం..

- ఉద్దాన ప్రాంతంలో ఐదు పంచాయతీలను ప్రభావితం చేసే పలాస మండలానికి చెందిన మాజీ తెలుగుదేశం ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు ఐదు పంచాయతీల ప్రజలతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీలో జోష్ పెరిగింది.
- పీఏసీఎస్ మాజీ చైర్మన్ సిర్ల రవిచంద్ర సుమారు 500 మందితో వైఎస్సార్ సీపీ కండువాలు ధరించారు.
- మందస మండలం బహడాపల్లి పంచాయతీ యువనాయకుడు సార రవియాదవ్ సుమారు 50 మందితో వైఎస్సార్ సీపీలో చేరారు. ఇదే మండలానికి చెందిన మహేష్, యోగేశ్వరరావు, మణి, క్రీడా సంఘాలకు చెందిన జట్టు సభ్యులు కూడా మంత్రి సీదరికే జైకొట్టారు.
- పలాస మండలం పూర్ణబద్ర గ్రామానికి చెందిన చిరంజీవులు, బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన మని, రెంటికోటకు రమేష్ సంతులు, పెదంచలకు చెందిన హర్షదయ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో సందడి చేశారు.
- మందస మండలం నల్లబొడ్లూరుకు చెందిన 40 కుటుంబాలు, రాంపురం పంచాయతీలో 40 మంది యువకులు అధికార పార్టీలో చేరారు.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 5వ వార్డు తాళ్లబద్రకు చెందిన కూటమి నాయకుడు బద్రి కృష్ణారావు యాదవ్ వైఎస్సార్ సీపీ కండువా వేసుకున్నారు.
- పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన తెలగ సంఘం అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకులు పుట్టా లోకనాథం, రట్టి పాపారావు, ఎర్రెర్ల నాగభూషణం, వై.శ్యామలరావు పార్టీ విధానాలు నచ్చక వైఎస్సార్ సీపీలో చేరారు.
- మందస మండలం బహడాపల్లికి చెందిన టీడీపీ నాయకులు కోట జయరాం, కోట నవీన్‌తో పాటు జిల్లుండకు చెందిన 15 కుటుంబాలు, దేవపురం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు సీదిరి సమక్షంలో పార్టీలో చేరారు.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు యండమూరి వెంకటరమణ, బొడ్డు పాపారావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది పార్టీలో చేరారు.
- మందస మండలం కొంకడాపుట్టి పంచాయతీ సందూరు గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన లండ సారధి ఆధ్వర్యంలో 10 కుటుంబాలు, బుడంబో గ్రామాని వార్డు మెంబర్ భాస్కరరావు, బాలరాజు, జగదీష్, మోహన్, రాజారావు, మహేష్ తదితరులు పార్టీలో చేరారు.
- వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి పంచాయతీ తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 25 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మల్లా రవికుమార్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది యువకులు పార్టీలో చేరారు. 4వ వార్డు రాజాం కాలనీలో 150 మంది, మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో 200 మంది వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్నారు.
- మందస మండలం హరిపురం పంచాయతీకి చెందిన సుమారు 50 మంది సీదిరి సమక్షంలో పార్టీలో చేరారు.

అభివృద్ధికి ఆకర్షితులై..

పలాస నియోజకవర్గంలో మూడు మండలాలు, మున్సిపాలిటీలో ఐదేళ్లలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు, రూ.1530 కోట్లతో సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు తిరిగి పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి రావాలని భావిస్తున్నారు. దీంతో టీడీపీ చేపడుతున్న పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీదిరి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ కండువాలు ధరిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషా, తండ్రి శివాజీ, భర్త వెంకన్నచౌదరిల వ్యవహార శైలి నచ్చక చాలా మంది పార్టీని వీడుతున్న పరిస్థితి నెలకొంది.



పలాస, మందస నుంచి పార్టీలో చేరిన జనసేన నాయకులతో మంత్రి సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం రూరల్: పార్టీలో చేరిన మత్స్యకారులతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పాతపట్నం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: కొత్తూరు మండలం కొత్త పొన్నుటూరు గ్రామంలో టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు గురువారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అంధవరం శ్యామ్‌సుందర్, కుమ్మరి కిరణ్, కుమ్మరి చిన్నారావు, కుమ్మరి సుదర్శన్, కూర్మాన సాయిరాజు, నాసర హరిబాబు, డోల జగదీశ్వరరావు, పుటంశెట్టి బాలరాజు, పుటంశెట్టి ప్రవీణ్, కూర్మాన విశ్వనాథం, పుటంశెట్టి చంటి, డోల గోవిందరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు సరిపల్లి ప్రసాదరావు, సచివాలయ మండల కన్వీనర్ గంటివలస ఆనంద్ పాల్గొన్నారు.

- శ్రీకాకుళం రూరల్: గార మండలం బందరువానిపేట గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పెదపాడులోని క్యాంపు కార్యాలయం వద్ద గనగళ్ల విశ్వనాథం, కోమర తాతారావు, పుక్కళ్ల అప్పారావు, బుడ్డా లక్ష్మయ్య, గుల్ల త్రినాథ్, బొండు మల్లేష్, పప్పు జంగమ్మ, గుల్ల చిన్నారావు, దుమ్ము అప్పలస్వామి తదితరులకు కండువాలు వేసి ఆహ్వానించారు.
- కోటబొమ్మాళి: కస్తూరిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సనపల నాగేశ్వరరావు, ఆయన భార్య పద్మావతి (మాజీ సర్పంచ్) గురువారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, పార్టీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, నూక సత్యరాజు, పేడాడ వెంకటరావు, ఎస్.వినోద్, బమ్మిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ చిన్నాల కృష్ణారావునాయుడు కుమారుడు లక్ష్మీనారాయణనాయుడు గురువారం మబగాంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగి పార్టీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సారవకోట పార్టీ కార్యాలయంలో పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాడాన కృష్ణారావు, మాజీ సర్పంచ్ పల్లి కృష్ణారావు, శలపాక శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్,నాయకులు పారశెల్లి తేజేశ్వరరావు పాల్గొన్నారు.



సారవకోట: చిన్నాల లక్ష్మీనారాయణనాయుడికి పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్



కోటబొమ్మాళి: కస్తూరిపాడులో నాగేశ్వరరావు, పద్మావతి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

అంబులెన్సుకు దారివ్వని టీడీపీ శ్రేణులు

- గంటకు పైగా నిలిచిపోవడంతో బాధితులకు తప్పని ఇక్కట్లు



రోడ్డుపైనే నిలిచిపోయిన 108 అంబులెన్స్

ఎల్.ఎన్.పేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని బొర్రంపేట నుంచి అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై టీడీపీ నాయకులు కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, ఆ పార్టీ పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టగా.. అదే సమయంలో 108 అంబులెన్సు రావిచెంద్రి నుంచి ఎల్.ఎన్.పేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఓ పేషెంట్‌ను తీసుకొస్తోంది. బొర్రంపేట వద్ద రోడ్డుపైనే నాయకులు ప్రసంగించడంతో సుమారు అరగంట పాటు అంబులెన్స్ నిలిచిపోయింది. అక్కడ నుంచి ర్యాలీగా వచ్చిన నాయకులు మండల కేంద్రంలో ప్రచార రథంపైనే బహిరంగ సభలు నిర్వహించారు. ఇక్కడ కూడా మరో 108 అంబులెన్స్ వాహనం సుమారు గంటకు పైగా నిలిచిపోయింది. హారన్ మోగిస్తునే ఉన్నా టీడీపీ శ్రేణులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గోవిందరావు నామినేషన్ వేసే సమయంలోనూ పాతపట్నంలో 108 అంబులెన్స్‌కు దారివ్వకుండా సుమారు గంట పాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే.

వ్యాన్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన మినీ వ్యాన్ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పలాస వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెలుతున్న వ్యాన్ ఒక్కసారిగా అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

గాయాలపాలైన డ్రైవర్‌ను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.



లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు

పక్కాగా మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఎంపిక

గార: వేట నిషేధ భృతి సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం అందించే సాయం మత్స్యకార భరోసా పథకం పొందే లబ్ధిదారుల ఎంపిక గురువారం జిల్లా అంతటా పక్కాగా జరిగిందని జిల్లా మత్స్యశాఖ జేడీ పి.శ్రీనివాసరావు అన్నారు. గార మండలం బందరువానిపేట, మొగదాలపాడు గ్రామాల్లో నిర్వహించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వేట విరామ సమయంలో పథకం కింద రూ.10 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. గతేడాది జిల్లాలో 14123 మందికి వేట నిషేధ భృతి అందిందని తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 6లోగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో బగాది సురేష్‌కుమార్, హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

102 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులు, పట్టుబడిన గంజాయితో జీఆర్‌పీ పోలీసులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో గురువారం 102 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖ లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పలాస రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం-2, 3లలో తనిఖీలు నిర్వహిస్తుండగా గుణపూర్ నుంచి వచ్చిన కేరళ రాష్ట్రానికి చెందిన షలీమ్, ఫిరోజ్, ముస్తఫా కారువిట్లి, అబ్బాస్ కె.టి, ముస్తాఫా ఎంపీ అనే ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీలు చేయగా 102 కిలోల గంజాయి గుర్తించారు. దీని విలువ సుమారు రూ.5,10,000 ఉంటుందని అంచనా వేశారు. ఐదుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం రైల్వే కోర్టుకు తరలించారు. తనిఖీల్లో జీఆర్‌పీ పలాస ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్, క్రైమ్ సిబ్బంది హెచ్‌సీ కోదండరావు, పీసీ ఎం. సంతోష్‌కుమార్, బి.దేవేంద్రనాథ్, పి.రమేష్‌బాబు, బి.శ్రీనివాసరావు, జి.నవీన్‌కుమార్, కె.శ్రీనివాసరావు, ఎస్.జీవరత్నం, సీహెచ్ లోకనాథం, టి.తేజ, అనిత తదితరులు పాల్గొన్నారు.

దోశ తినిపించి.. గొంతు నులిమి..

- వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన మహిళ
- అమలపాడులో అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు
- బంగారం కోసమే ఘాతుకానికి పాల్పడినట్లు వెల్లడి



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు, ఎస్‌ఐ రామారావు



స్వాధీనం చేసుకున్న బంగారం

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడులో గత నెల 28న కాలువలో శవమై తేలిన దున్న దమయంతి(62) మృతి కేసును పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. గ్రామానికి చెందిన యానాది జ్యోతి బంగారం కోసమే హత్య చేసి యానాది నారాయణ అనే వ్యక్తి సహకారంతో కాలువలో పడేసినట్లు దర్యాప్తులో తేల్చారు. ఈ కేసుకు సంబంధించి కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్‌ఐ సీహెచ్.రామారావు గురువారం వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

విలాసాలకు అలవాటుపడి..

అమలపాడుకు చెందిన యానాది జ్యోతి గ్రామంలో వడ్డీ వ్యాపారం చేస్తోంది. భర్త వెల్డర్‌గా పని చేస్తున్నాడు. విలాసాలకు అలవాటు పడిన జ్యోతి తన అల్లుడిని మధ్యవర్తిగా ఉంచి నందిగాం మండలం హర్షబాడకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకుంది. అప్పు తీర్చమని ఒత్తిడి పెరగడంతో ఏం చేయాలో తెలియని సమయంలో అదే గ్రామానికి చెందిన దున్న దమయంతి వద్ద ఉన్న బంగారు ఆభరణాలపై కన్ను పడింది. దమయంతిని మచ్చిక చేసుకుని ఇంటికి పిలిచి ప్రతిరోజూ పండ్లు, స్నాక్స్ అందిస్తూ మరింత స్నేహం పెంచుకుంది. గత నెల 24న ఇదే మాదిరిగా పిలిచి దోశలు చేసింది. దమయంతి దోశ తింటున్న క్రమంలో జ్యోతి వెనుక నుంచి దుప్పటి కప్పి రెండు చేతులతో గొంతు నులమడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే మృతురాలి ఒంటిపై ఉన్న నాలుగు బంగారు గాజులు, రెండు పేకల పుస్తెల తాడు, చెవి దిద్దులు, మూడు ఉంగరాలు, జత ఎత్తు గొలుసులు, చైన్ తీసుకుని మృతదేహాన్ని ఇంటిలో మంచం కింద ఉంచి దుప్పటి కప్పేసింది. అదేరోజు రాత్రి జ్యోతి మేనమామ యానాది నారాయణను రప్పించి జరిగిన విషయం చెప్పింది. బంగారంలో వాటాతో పాటు తనతో వివాహేతర సంబంధానికి అంగీకరిస్తే మృతదేహం మాయం చేసేందుకు సహకరిస్తానని డిమాండ్ చేయగా జ్యోతి ఒప్పుకుంది. అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో దుప్పటిలో చుట్టిన దమయంతి మృతదేహాన్ని ఇంటి సమీపంలో ఉన్న కాలువలో కుక్కి పలకలు కప్పేశారు.

దుర్వాసన రావడంతో..

ఇదిలా ఉండగా దమయంతి కనిపించకపోవడంతో కుమారుడు కృష్ణారావు రెండు రోజుల పాటు వెతికారు. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఏప్రిల్ 26న షిరిడిసాయి బాబా ఆలయానికి ఎదురుగా ఉన్న కాలువ సమీపంలోకి తాపీమేస్త్రీ వెళ్లగా దుర్వాసన రావడంతో గ్రామస్తులకు తెలిపాడు. అనుమానం వచ్చి పలకలు తొలగించగా దమయంతి మృతదేహం కనిపించింది. వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ రామారావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో మృతురాలి మెడ ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే అమలపాడు చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా జ్యోతి, నారాయణలపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఐతే జ్యోతి ఆ సమయంలో గ్రామంలో ఉండకుండా శ్రీకాకుళం, కాశీబుగ్గలోని బంగారం దుకాణాల్లో నగలు అమ్మేందుకు ప్రయత్నాలు చేసింది. బంగారం కరిగించి పుస్తెలు సైతం చేయించుకుని ఏమీ ఎరగనట్లు గ్రామానికి వచ్చేసింది. పోలీసుల విచారణ ముమ్మరం చేయడంతో చివరకు తాము హత్యానేరం నుంచి తప్పించుకోలేమని భావించి ఈ నెల 1న వీఆర్‌ఓ కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి వద్ద నేరం చేసినట్లు అంగీకరించి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ డి.తిరుమలరావుకు సమాచారం అందించి ఘటనా స్థలంలో సీన్ రీ క్రియేషన్ చేశారు. అనంతరం జ్యోతి, నారాయణలను అరెస్టు చేసి పలాస మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

'చంద్రబాబుది స్వార్థ పూరిత రాజకీయం'



గుమ్మా నగేష్ దంపతులను అభినందిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం కల్చరల్: చంద్రబాబుది స్వార్థ పూరిత రాజకీయమని, అది తనకు నచ్చదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గుమ్మా నగేష్ షష్ట్యబ్ది సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌కు విశాల దృక్పథం ఉందని, అందుకే బ్రాహ్మణ వర్గాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సాయం అందజేశారని పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయినపుడు చంద్రబాబు కేవలం వ్యాపార ధోరణి ప్రదర్శించారని, కొత్త రాజధాని విషయంలో కూడా అదే వ్యాపార ధోరణి ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారని అన్నారు. అధికార వికేంద్రీకరణ చేసి అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం పాటుపడుతోందని, కానీ ఇంకా చంద్రబాబు వ్యాపార ధోరణి వీడిపోలేదన్నారు. తాము గతంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని తెలిపారు. అనంతరం గుమ్మా నగేష్ దంపతులను బ్రాహ్మణ సంఘం తరపున ఘనంగా సత్కరించారు. ముందుగా మావుడూరి సోదరుల వాయులీన కచేరి జరిగింది.

కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు, బ్రాహ్మణ సంఘ గౌరవాధ్యక్షులు కేవీఎస్ భుక్త, సంఘం కార్యదర్శి భాస్కరభట్ల శ్రీరామశర్మ, ఇప్పిలి శంకరశర్మ, వివిఎస్ ప్రకాష్, కాపవరపు సిజు, మేడూరు ప్రసాదరావు, కార్పొరేషన్ డైరెక్టర్ బలివాడ రాజేష్, యామిజాల గాయత్రి, కార్పొరేషన్ డైరెక్టర్ కామేశ్వరి, త్రిపురాన వెంకటరత్నం, వెంకటేశ్వరులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



చీడివలస గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: పేద ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చీడివలస, గంగంపేట, తోటవాడ, టీఆర్ రాజుపేట, సంకురాడ గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమదాలవలసలో తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేశామని పేర్కొన్నారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో సర్వేలన్నీ వన్ సైడ్ చూపిస్తున్నాయని, గెలిచేది వైఎస్సార్‌సీపీ అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, మండల జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, వైఎస్సార్ మండల పార్టీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, మాజీ ఏఎంసీ చైర్మెన్ మండల సచివాలయ కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, చీడివలస, తోటవాడ గ్రామ సర్పంచ్‌లు సూర అనందరావు, బూరి శ్రీరామమూర్తి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నున్నగొప్పల త్రినాధరావు, బొడ్డేపల్లి నాగరాజు, బొడ్డేపల్లి నారాయణమూర్తి, ఏగు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్ల పరిశీలన



బంటుపల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల భద్రత ఏర్పాట్లను, మౌలిక సదుపాయాలు కల్పనపై పరిశీలిస్తున్నామని అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్ తెలిపారు. మండలంలోని కోటపాలెం, బంటుపల్లి, దేరసాం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజు పరిస్థితులు, భౌగోళిక పరిస్థితులను స్వయంగా ఆమె పర్యవేక్షించారు. రూట్ మ్యాప్‌పై ఆరా తీసి, ఎన్నికలు జరిగే రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల భద్రత పరమైన అంశాలపై సంబంధిత ఎస్ఐకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.గోవిందరావు ఉన్నారు.

బాబూ.. ఇప్పటికైనా నిజం చెప్పు

- టీడీపీ మేనిఫెస్టోపై నిప్పులు చెరిగిన ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: తన కుటిల రాజకీయాల కోసం ప్రజల నమ్మకాన్ని సైతం తాకట్టు పెట్టేందుకు వెనుకాడని ఘనుడు చంద్రబాబు అంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నిప్పులు చెరిగారు. గురువారం చీడివలస పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి వేతనదారులతో ఆయన మాట్లాడారు. 'చంద్రబాబూ.. ఇప్పటికైనా నిజం చెప్పు. మీ మేనిఫెస్టోను అమలు చేయటం మన రాష్ట్ర బడ్జెట్‌లో సాధ్యపడేదేనా..?' అంటూ నిలదీశారు. గతంలో అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన తర్వాత యూటర్న్ తీసుకుని ఆ హామీలు గాలికొదిలేశాడని గుర్తు చేశారు. మళ్లీ గూడు పుఠాని గ్రూపుతో కలసి జనాలను మోసం చేస్తున్నారని విమర్శించారు. దొంగలంతా ఒక్కటైనా.. ప్రజలు మాత్రం జగన్‌వైపు వున్నారని తేల్చిచెప్పారు. ఎంపీతో సహా జిల్లాలో అన్ని ఎమ్మెల్యే స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని కృష్ణదాస్ అన్నారు. ఆయనతోపాటు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ముద్దాడ దమయంతి, మండలపార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు బైరాగినాయుడు, రాము తదితరులు ఉన్నారు.

'అవ్వాతాతలను గౌరవించాలి'



అవ్వలకు దుశ్శాలువ కప్పి సన్మానిస్తున్న పిరియా విజయ

సోంపేట: అవ్వాతాతలు సమాజానికి విలువైన ఆస్తులని, వారి సలహాలు, సూచనలు వెలకట్టలేనివని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గొల్లూరు పంచాయతీలో అవ్వాతాతలకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవ్వలకు కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన బాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్‌లు తడక జోగారావు, పిన్నింటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Format C-7

(For political parties to publish in the newspapers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates. (As per the Commission's directions issued in pursuance of the Order dated13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition(C) no. 2192 of 2018 in WP(C) no. 536 of 2011)

Name of Political Party : YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY
***Name of the Election : Andhra Pradesh Legislative Assembly**
Name of State/ UT : ANDHRA PRADESH
Name of the Constituency -05 - SRIKAKULAM
Name of the candidate - DHARMANA PRASADA RAO

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	1. u/s 188, 171E IPC r/w 123(3) RPA,1951 2. u/s 188IPC 3. u/s 188, 171E IPC r/w 123(3) RPA,1951 4. u/s RC 19A/2011 of CBI, ACB HYD 5. u/s RC 19A/2011 of CBI, ACB HYD 6. u/s RC 19A/2011 of CBI, ACB HYD 7. u/s RC 19A/2011 of CBI, ACB HYD 8. u/s RC 19A/2011 of CBI, ACB HYD
	b. Case no.	1. NIL 2. NIL 3. NIL 4. SC No 2/2021 5. SC No 3/2021
		6. CC No 28/2013
		7. CC No 26/2013 8. CC No 14/2014
	c. Name of the Court	1. JFCM, Srikakulam 2. JFCM, Srikakulam 3. JFCM, Srikakulam 4. Prl. Spl Judge for CBI & Spl Court PMLA, 2002, Nampally HYD 5. Prl. Spl Judge for CBI & Spl Court PMLA, 2002, Nampally HYD Prl. Spl Judge for CBI & Spl Court PMLA, 2002, Nampally HYD
	d. Whether charges have been framed or not (Yes/No)	Yes
	e. Date of conviction, if any f. Details of punishment undergone, if any g. Any other information required to be given	Not Applicable Not Applicable Not Applicable
2.	The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The candidate holds a wide recognition in the entire State and possess all the qualities which are required to make his constituency a model constituency, he served as an MLA, Cabinet Minister and senior most politician in the State. The candidate always reaches to the people in their good time and vice versa. The candidate fulfills all the aspirations of the constituency and has actively work for the betterment of the people of his constituency and party. The candidate is very famous among all the Sections of society
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	The pending cases mentioned in the affidavit are politically motivated and there will be no adverse outcome against alleged offence. The YSRCP party always believes that politically motivated cases should not bar a deserving candidate from people's representation therefore, the candidate has been given chance to contesting this constituency ensuing elections 2024.

Sd/- LellaAppi Reddy
State General Secretary, Yuvajana Sramika Rythu Congress Party

'వైఎస్సార్‌సీపీతోనే అట్టడుగు వర్గాల అభ్యున్నతి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ, రజక, టైలర్స్ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీతోనే అట్టడుగు వర్గాల అభ్యున్నతి జరుగుతుందని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొరుపూరు గజపతిరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం గురువారం జరిగింది. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పేదరికమే ప్రామాణికంగా అన్ని వర్గాలకు మేలు చేశారని వారు తెలిపారు. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 56 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం చంద్రబాబును సంప్రదించినప్పుడు తోకలు కత్తిరిస్తామని అగౌరవంగా మాట్లాడారని, వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్ జీఓ 50 ద్వారా నాయీ బ్రాహ్మణులకు గౌరవాన్ని పెంచారని తెలిపారు. నాయీ బ్రాహ్మణులతో పాటు పలు సామాజిక వర్గాలకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా సామాజిక భవనాలను అప్పగించారన్నారు. ఇందుకోసం ప్రతి సామాజిక భవనానికి ప్రభుత్వ ధనం రూ.50 లక్షలు వెచ్చించారని తెలిపారు. నాయీ నాదస్వర, డోలు కళాకారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి నెలా రూ.3వేలు పెన్షన్ అందిస్తోందని, అదే రీతిన అన్ని సామాజిక వర్గాలకు పేదలను గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1156 దేవాలయాల్లోని పాలక మండలాల్లో నియామకాలు చేసి తమ గౌరవాన్ని పెంచారని చెప్పారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ నాయకులు గుంటమక్కల పాపారావు మాట్లాడుతూ టైలర్స్‌కు జీఓ 86 ద్వారా గుర్తింపునిచ్చి సొసైటీ ఏర్పాటుకు సహకరించిన ఘనత వైఎస్ఆర్‌ది అని పేర్కొన్నారు. కరోనా సమయంలో టైలర్ల దుస్థితిని మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వివరించగా ఆయన సీఎం వైఎస్ జగన్‌తో చర్చించి 20 రోజుల్లో టైలర్లకు రూ.10వేలు అందించేలా చర్యలు చేపట్టారని గుర్తు చేశారు.

రజక సంఘ అధ్యక్షుడు కుప్పిలి సూర్యారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా నాసిరకం ఇస్త్రీ పెట్టెలను అందించారని, దాని వల్లే అనేక ఇబ్బందులు పడ్డామని తెలిపారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి అధికారం చేపట్టిన తరువాత రూ.10వేలు రజకుల అకౌంట్లలో వేసి వారిలో ఆత్మగౌరవాన్ని పెంచారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమం ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ జగన్నాథం, లక్కా సత్యనారాయణ, బీవీ రమణమూర్తి, కురిటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్లనే..

బూర్జ: లాభాం గ్రామానికి చెందిన పప్పల వెంకటఅప్పలనాయుడు (40), కొడుకు పప్పల రేవంత్ (10) మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అయితే అప్పలనాయుడు మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్లనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలియజేసిన వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం రేవంత్‌ను తండ్రి అప్పలనాయుడు మెడకు తాడు కట్టి ఇంట్లో ఉన్న మిద్దె దూలానికి బిగించి ఉరి తీశాడు. తర్వాత తాను కూడా తాడుతో ఉరి పోసుకొని చనిపోయాడు. అప్పలనాయుడు మానసిక స్థితి చాలాకాలంగా సరిగా లేదు. అందుకే భార్య కూడా కన్నవారింటికి వెళ్లిపోయారు. కొడుకు రేవంత్ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నాడు. ఇటీవలే అతడిని అప్పలనాయుడు ఊరికి తీసుకువచ్చి తనతో పాటే పొలం పనులకు తీసుకెళ్లేవాడు. అప్పలనాయుడు గ్రామంలో ఎవరితోనూ కలిసి ఉండేవాడు కాదు. ఒంటరిగా ఉండేవాడు. ఆ మానసిక వ్యథతోనే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. తండ్రీ కొడుకుల మృతదేహాలకు శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం చేశారు.

ఏడాదిన్నరగా 18 వేల కిలోమీటర్ల ప్రయాణం



సైకిల్‌పై ప్రయాణిస్తున్న అక్షయ్ పటేల్

కాశీబుగ్గ: ఏడాదిన్నర కాలంగా దేశమంతా సైకిల్‌పై తిరుగుతున్న అక్షయ్‌పటేల్ అనే ఉత్తరప్రదేశ్ యువకుడు గురువారం పలాసకు చేరుకున్నాడు. 12 జ్యోతిర్లింగాలు, చార్‌ధామ్ యాత్ర కోసం 18,000 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నానని తెలిపారు. ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తుండగా లక్ష్మీపురం టోల్‌గేటు సమీపంలో కనిపించారు.

పెద్దబొడ్డపాడులో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి తేజశ్విత

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం పెద్దబొడ్డపాడు గ్రామ సచివాలయం వద్ద గురువారం వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.తేజశ్విత పర్యవేక్షణలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉష్ణోగ్రత ప్రభావంతో శరీరంలో వచ్చే మార్పులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చక్రధర్,ఎంఎల్‌హెచ్‌పీ యశోధ ,వైద్య సిబ్బంది టి.చిన్నమ్మి,బి.తేజేశ్వరి తదితరులు ఉన్నారు.

'జిల్లా ఎక్సైజ్ శాఖ సమర్థంగా పనిచేస్తోంది'

శ్రీకాకుళం క్రైమ్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సమర్థంగా పనిచేస్తోందని, డిపో నుంచి లిక్కర్, బీర్ల విక్రయాలు కట్టుదిట్టం చేశామని ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇ.సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన గురువారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు (జిఆర్‌ఓ), బార్లకు ఐఎంఎఫ్ఎల్, బీరు బాక్సులు తగ్గించామని, టైమింగ్ ప్రకారం షాపుల్లో విక్రయాలు జరుపుతున్నామని పేర్కొన్నారు. డిపో నుంచి సరుకు తీసుకెళ్లే ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరాలు అమర్చడంతో వాహనం స్థితి, ప్రదేశం తెలుసుకుని అక్రమ రవాణా అరికట్టవచ్చన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి ఎక్కువ మొత్తంలో విక్రయాలు జరపడం లేదని, ఇలాంటి ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఇద్దరు సూపర్‌వైజర్లు, 12 మంది సేల్స్‌మెన్‌లను విధుల నుంచి తొలగించామన్నారు. 13 కేసులు నమోదు చేసి 102.79 లీటర్ల మద్యం సీజ్ చేశామని, వీటి విలువ రూ. 90,660లు ఉంటుందన్నారు. పౌరులెవరైనా శ్రీకాకుళం ఎక్సైజ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 7989343418కు కానీ, 1950కు గానీ కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) విభాగాలు సంయుక్తంగా బెల్టు కేసులు నమోదు చేసి అక్రమ మద్యం అరికడుతున్నామన్నారు.

'మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల (సూక్ష్మ పరిశీలకులు) పాత్ర కీలకమని, పోలింగ్ తీరును గుర్తించడంలో వారు ఇచ్చే నివేదిక ఎంతో ముఖ్యమని కేంద్ర ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ శేఖర్ విద్యార్థి అన్నారు. శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధ్యక్షతన గురువారం మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని పరిశీలిస్తూ ఎక్కడైనా తప్పిదాలు.. ఉల్లంఘనలు జరిగితే వెంటనే రిటర్నింగ్ అధికారి, ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్‌కు గంట ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని, అభ్యర్థికి ఒక పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటూ, ఓటర్లు వరుసక్రమంలో వచ్చేలా చూడాలన్నారు. పోలింగ్ విధానాన్ని పరిశీలించి మైక్రో అబ్జర్వర్లకు ఇచ్చిన ఫార్మాట్‌లోనే నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు తలత్ ఫర్వేజ్ ఇక్బాల్ రొహెల్లా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఎన్నికల నియమావళి పాటిస్తున్నారో లేదో చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సూర్య కిరణ్, శ్రీకాకుళం ఆర్‌ఓ సీహెచ్ రంగయ్య, ఉద్యానవన శాఖదికారి ప్రసాద్, డ్వామా పీడీ చిట్టిరాజు, మెప్మా పీడీ కిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.